కడియం శ్రీహరిపై కాంగ్రెస్ క్యాడర్ ఫైర్

మొదటిపేజీ తరువాయి...

రాస్తారోకోకు దిగింది. మండల కాంగ్రెస్ కో ఆర్డినేటర్ భిక్షపతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆయన వైఖరిని తప్పుబట్టారు. ఇందిరమ్మ కమిటీలే కాకుండా, కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాలు తమకు తెలియకుండానే నిర్వహిస్తూ వస్తున్నారని మండిపడ్డారు. రోడ్డుపైనే కడియం శ్రీహరి దిష్టిబొమ్మ దహనం చేసేందుకు రెడీ అయ్యారు. అయితే కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిన సింగాపురం ఇందిర ఫోన్‌లో నచ్చజెప్పడంతో కార్యకర్తలు దిష్టిబొమ్మ దగ్ధాన్ని విరమించుకున్నారు. ప్రతిపక్షంలో ఉన్న పదేండ్ల కాంగ్రెస్ కోసం కష్టపడ్డామని, కడియం శ్రీహరి కొత్తగా వచ్చి తమను పక్కనబెడుతున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

డిఫాల్ట్ మిల్లర్లకు ధాన్యం కేటాయించం

మంత్రుల కమిటీ నిర్ణయం

హైదరాబాద్, అక్టోబర్ 16(నమస్తే తెలంగాణ): డిఫాల్ట్ మిల్లర్లకు ప్రస్తుత సీజన్‌లో ధాన్యాన్ని కేటాయించబోమని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలుపై ఏర్పాటైన సబ్ కమిటీ బుధవారం రెండోసారి సమావేశమైంది. సచివాలయంలో జరిగిన ఈ భేటీలో మంత్రులు మాట్లాడుతూ.. డిఫాల్ట్ మిల్లర్లు బకాయి ఉన్న మొత్తం బియ్యాన్ని త్వరగా ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించారు. డిఫాల్ట్ మిల్లర్ల విషయంలో కఠిన వైఖరి అవలంబించాలని నిర్ణయించినట్టు తెలిపారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, కార్యదర్శి రఘునందన్‌రావు, సివిల్ సప్లై కమిషనర్ చౌహాన్, జీఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచకుంటే అగ్నిగుండం

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ, అక్టోబర్ 16: బీసీ రిజర్వేషన్ల సంఖ్యను పెంచకుంటే రాష్ట్రం అగ్నిగుండం అవుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం హెచ్చరించారు. హైదరాబాద్‌లోని అభినందన్ హోటల్‌లో బుధవారం బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల సంఖ్యను పెంచకుండా రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీసీ నేత ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో ఆమరణ దీక్షకు దిగుతామని స్పష్టం చేశారు. కులగణన చేపట్టి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నందగోపాల్, ఉదయ్‌నేత, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల జనవరి టికెట్ల కోటా 19న విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల 2025 జనవరి నెల కోటా టికెట్లను ఈ నెల 19న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నది. ఈ నెల 21న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని టీటీడీ అధికారులు పేర్కొన్నారు. ఈ టికెట్లు పొందిన వారు 21 నుంచి 23న మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయని తెలిపారు. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను ఈ నెల 22న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నట్టు తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవల, వాటి దర్శన స్లాట్ల జనవరి నెల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నామని పేర్కొన్నారు. జనవరి నెలలో అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 23న ఉదయం 10 గంటలకు, శ్రీవాణి ట్రస్టు టికెట్ల జనవరి నెల ఆన్‌లైన్ కోటాను ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్టు తెలిపారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా జనవరి నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నారు.

24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల

జనవరి నెలలో ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలలో జనవరి నెల గదుల కోటాను ఈ నెల 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామని టీటీడీ అధికారులు పేర్కొన్నారు. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లను బుక్ చేసుకోవాలని తెలిపారు. శ్రీవారి ఆలయంలో గురువారం పౌర్ణమి గరుడసేవ జరుగనున్నది.

పదేండ్లలో 1,000కి పైగా సర్జరీలు

మొదటిపేజీ తరువాయి...

పూర్తిచేసినట్టు వారు వెల్లడించారు. నిమ్స్‌లో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభమైన 1989 నుంచి 2014 అక్టోబర్ అర్ధ మాసం వరకు మొత్తం 1,731 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను నిర్వహించినట్టు నిమ్స్ అధికారులు వెల్లడించారు.

కేసీఆర్ హయాంలోనే ఆరోగ్యశ్రీ వర్తింపు

లక్షలాది రూపాయల ఖర్చుతో కూడిన అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు చేయించుకోలేక ఎందరో నిరుపేద రోగులు మృత్యువాత పడటాన్ని చూసి తట్టుకోలేక నాటి కేసీఆర్ సర్కార్ ఖరీదైన అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చింది. దీంతో నిరుపేద రోగులు సైతం ఖరీదైన అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకుని పునర్జీవనాన్ని పొందుతున్నారు. ఈ క్రమంలోనే మూత్రపిండ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులు అత్యధిక సంఖ్యలో పైసా ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు చేయించుకోగలుగుతున్నారు. దీనివల్ల తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు నెలకు రెండంకెలకే పరిమితమైన కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల సంఖ్య కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెలకు మూడంకెలకు చేరుకున్నది. కానీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 ఏండ్లలో 971 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు జరగడం ప్రజావైద్యంపై నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చొరవకు నిదర్శనం.

పదేండ్లలో రూ.160 కోట్లతో వైద్యం

ఒక కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ శస్త్రచికిత్సకు కార్పొరేట్‌లో రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని, నిమ్స్‌లో పైసా ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ వంటి ఆరోగ్య పథకాలతో ఒక్క నిమ్స్ దవాఖానలోనే పెద్ద సంఖ్యలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఇదే కాకుండా ఉస్మానియా, గాంధీలో సైతం కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. అయితే నిమ్స్‌లో మాత్రం కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఒకేరోజు రెండు లేదా అంతకంటే ఎక్కువ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్ కూడా చేశామని, అలాంటివి దాదాపు 10 ప్రత్యేక సందర్భాలు ఉన్నందునే ఇంత తక్కువ సమయంలో ఎక్కువ ట్రాన్స్‌ప్లాంట్స్ చేయగలుగుతున్నామని డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. ఢిల్లీలోని ఎయిమ్స్ వంటి సంస్థల్లో ట్రాన్స్‌ప్లాంట్ చేసేందుకు ప్రత్యేక విభాగం, ప్రత్యేక వైద్య బృందం పనిచేస్తుంది. కానీ నిమ్స్‌లో మాత్రం యూరాలజీ విభాగంలోనే సంబంధిత వైద్యబృందం ఒకపక్కన కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్ చేస్తూనే మరో పక్క ఇతర యూరాలజీ సంబంధిత ప్రొసీజర్లను నిర్వహిస్తున్నదని, ఈ క్రమంలో ప్రతి నెలా 800 నుంచి 900 యూరాలజీ ప్రొసీజర్స్‌ను జరుపుతున్నట్లు డాక్టర్ రాహుల్ దేవరాజ్ వివరించారు.

కేసీఆర్ హయాంలో ఏటా 100 ఆపరేషన్లు

కేసీఆర్ సర్కార్ హయాంలో నాటి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా హరీశ్‌రావు నిరుపేదల వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో నిమ్స్‌లో ఏటా కనీసం 100 కిడ్నీ మార్పిడీ ఆపరేషన్లు జరగడం ఆనవాయితీగా మారింది. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన మౌలిక వైద్య సధుపాయాలు, అత్యాధునిక పరికరాలు, రోగులకు ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ వంటి ఆరోగ్య పథకాలతో ఒక్క నిమ్స్ దవాఖానలోనే పెద్ద సంఖ్యలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఇదే కాకుండా ఉస్మానియా, గాంధీలో సైతం కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. అయితే నిమ్స్‌లో మాత్రం కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఒకేరోజు రెండు లేదా అంతకంటే ఎక్కువ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్ కూడా చేశామని, అలాంటివి దాదాపు 10 ప్రత్యేక సందర్భాలు ఉన్నందునే ఇంత తక్కువ సమయంలో ఎక్కువ ట్రాన్స్‌ప్లాంట్స్ చేయగలుగుతున్నామని డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. ఢిల్లీలోని ఎయిమ్స్ వంటి సంస్థల్లో ట్రాన్స్‌ప్లాంట్ చేసేందుకు ప్రత్యేక విభాగం, ప్రత్యేక వైద్య బృందం పనిచేస్తుంది. కానీ నిమ్స్‌లో మాత్రం యూరాలజీ విభాగంలోనే సంబంధిత వైద్యబృందం ఒకపక్కన కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్ చేస్తూనే మరో పక్క ఇతర యూరాలజీ సంబంధిత ప్రొసీజర్లను నిర్వహిస్తున్నదని, ఈ క్రమంలో ప్రతి నెలా 800 నుంచి 900 యూరాలజీ ప్రొసీజర్స్‌ను జరుపుతున్నట్లు డాక్టర్ రాహుల్ దేవరాజ్ వివరించారు.

జీవితకాలం ఉచితంగా మందులు

కిడ్నీ మార్పిడి చేయించుకున్న రోగులు తప్పనిసరిగా ఇమ్యూనోసప్రెషన్ మందులు వాడాల్సి ఉంటుంది. ఈ మందులను రోగి జీవితకాలం వాడాల్సి ఉంటుంది. ఈ మందులకు ప్రతినెలా రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చవుతుంది. ఈ మందులను కూడా నిమ్స్‌లో కిడ్నీ మార్పిడి చేయించుకున్న రోగులకు జీవితకాలం పాటు పూర్తి ఉచితంగా అందచేస్తున్నట్టు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. బీరప్ప సహకారంతో యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ రాహుల్ దేవరాజ్ ఆధ్వర్యంలో పలువురు డాక్టర్ల సహకారంతో ఈ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్లను విజయవంతంగా జరిపినట్టు అక్కడి వైద్యులు వెల్లడించారు. వైద్యచికిత్సలు, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ వంటి అవయవ మార్పిడి శస్త్రచికిత్సలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు నిమ్స్ వైద్యబృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

గత 10 ఏండ్లలో జరిగిన కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల వివరాలు

సంవత్సరం	కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల సంఖ్య
2014	78
2015	95
2016	111
2017	114
2018	108
2019	107
2020	26 (కరోనా సమయం)
2021	102
2022	93
2023	137
2024	101 (అక్టోబర్ 10 వరకు)

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బాబుకు రిలీఫ్?

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు క్లీన్‌చిట్ ఇచ్చిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసులో సీమెన్స్ సంస్థకు చెందిన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన సంగతి తెలిసిందే. ఢిల్లీ, ముంబై, పుణెలోని స్థిరాస్తులు, బ్యాంక్ డిపాజిట్లు, షేర్లు వంటివి కలిపి మొత్తం 23.54 కోట్లను అటాచ్ చేసింది. అయితే ఈ కేసులో చంద్రబాబుకు సంబంధం ఉన్నట్టు ఈడీ అధికారులు ఎక్కడా ప్రస్తావించలేదు. దీంతో ఈ కేసు నుంచి ఆయన బయటపడినట్టుగా భావిస్తున్నారు. ఈ మేరకు జాతీయ మీడియా సంస్థలు చంద్రబాబుకు కేసు నుంచి ఊరట లభించినట్టు పేర్కొంటూ కథనాలు ప్రచురించాయి.

'ఈడీ'క్లీన్ చిట్ ఇవ్వలేదు : సతీశ్‌రెడ్డి

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో షెల్ కంపెనీలకు నిధులు మళ్లించారని ఈడీ తేల్చిందని వైఎస్సార్‌సీపీ నేత సతీశ్‌రెడ్డి చెప్పారు. తాడేపల్లి పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్కిల్ కేసులో ఈడీ వద్ద స్పష్టమైన ఆధారాలున్నాయన్నారు. ఈడీ ఇచ్చిన ప్రెస్‌నోట్‌లో ఎక్కడా

క్లీన్ చిట్ ఇస్తున్నామని వెల్లడించలేదని తెలిపారు. ఈడీ ప్రెస్‌నోట్‌ను చంద్రబాబు తనకు అనుకూలంగా మలుచుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబు మెడకు ఈడీ ఉరితాడు బిగుసుకుందన్నారు. క్లీన్‌చిట్ ఇవ్వాల్సింది కోర్టు అని, కేసు విచారణలో ఉండాగానే క్లీన్‌చిట్ అని చంద్రబాబు ముఠా ఎలా అంటుందని ప్రశ్నించారు.

కల్వకుర్తి యూత్ కాంగ్రెస్ నేత రాజీనామా

ఆమనగల్లు, అక్టోబర్ 16 : రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం శెట్టిపల్లికి చెందిన కల్వకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోట్ల సాయిబాబా బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. తన సిద్ధాంతాలు, ఆశయాలు, తన రాజకీయ దృక్పథం కాంగ్రెస్ పార్టీ విధానాలతో సరిపోవడం లేదని ఆయన పేర్కొన్నారు.



టీఆర్‌సీ కమిషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నిరంతర విద్యుత్తుతో జీడీపీ పెంచుతున్నం

ఈఆర్సీ నూతన భవన ప్రారంభోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేసి దేశ జీడీపీని పెంచుతున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. రాష్ట్రంలో 20వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తికి ప్రణాళికలు రచిస్తున్నట్టు తెలిపారు. హైదరాబాద్‌లోని కళ్యాణ్‌నగర్‌లో నిర్మించిన తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ (టీఆర్‌సీ) కమిషన్ కార్యాలయం నూతన భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో భట్టి మాట్లాడుతూ.. ప్రజలపై ఆర్థికభారం పడకుండా విద్యుత్తు నియంత్రణ మండలి పనిచేస్తుందని చెప్పారు. వచ్చే పదేండ్లలో పీక్ డిమాండ్‌ను అందుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. రైతులకు పంటతోపాటు పవర్‌పైన ఆదాయం వచ్చేలా ప్లాన్ చేస్తున్నట్టు వెల్లడించారు. రెగ్యులేటరీ కమిషన్‌కు అవసరమైన సిబ్బంది, ఇతర సౌకర్యాలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని చెప్పారు. కాలుష్యం, ఖర్చు అన్నీ పెరిగిపోతున్న నేపథ్యంలో వాటిని తగ్గించుకుంటూ సహజ వెలుతురు, జీరో నెట్ బిల్ వంటి సౌకర్యాలతో సంపన్న దేశాలకు దీటుగా తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటర్ కమిషన్ విద్యుత్తు నియంత్రణ భవన్ పేరిట కొత్త కార్యాలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో టీఈఆర్సీ చైర్మన్ రంగారావు, టెక్నికల్ మెంబర్ మనోహరరాజు, ఫైనాన్స్ మెంబర్ కృష్ణయ్య, సీఎండీలు ముషారఫ్ అలీ ఫారుకి, వరుణ్‌రెడ్డి, జేఎండీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్‌లకు హైకోర్టులోనూ దక్కని ఊరట

- సొంత రాష్ట్రంలో విధుల్లో చేరాలన్న ధర్మాసనం
- ఐదుగురు ఐఏఎస్‌ల రిలీవ్
- వారి బాధ్యతలు ఇతరులకు
- జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తికి పూర్తి అదనపు బాధ్యతలు
- ఏపీ నుంచి తెలంగాణలో రిపోర్ట్ చేసిన ఇద్దరు ఐఏఎస్‌లు

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): సొంత క్యాడర్‌కు వెళ్లాలన్న ఆదేశాలను సవాలు చేస్తూ హైకోర్టుకు వెళ్లిన ఆల్ ఇండియా సర్వీసెస్ (ఏఐఎస్) అధికారులకు అక్కడ కూడా ఎదురుదెబ్బ తగిలింది. కేంద్రం ఈ నెల 9న ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఏఐఎస్ అధికారులు వారికి కేటాయించిన రాష్ట్రాల్లో చేరాల్సిందేనని తేల్చిచెప్పింది. కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు ఏమాత్రం ఆస్కారం లేదని స్పష్టంచేసింది. ఆలిండియా సర్వీసు ఉద్యోగుల కేటాయింపు పరిపాలనా పరమైన నిర్ణయమని, ఆ నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమని తెలిపింది. ఈ మేరకు సుప్రీంకోర్టు సైతం పలు తీర్పులు వెలువరించిదని గుర్తుచేసింది. ఈ ఏడాది జనవరిలో హైకోర్టు జారీచేసిన ఉత్తర్వులను పట్టించుకోకుండా కేంద్రం ఈ నెల 9న గత కేటాయింపులనే ఖరారు చేసిందంటూ ఐఏఎస్ అధికారులు దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్లపై బుధవారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభినంద్‌కుమార్ షావలి, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ధర్మాసనం విచారణ జరిపింది. తెలంగాణలో పనిచేస్తున్న నలుగురు ఐఏఎస్‌లు, ఏపీలో పనిచేస్తున్న ముగ్గురు ఐఏఎస్‌లు వేర్వేరుగా దాఖలుచేసిన ఈ పిటిషన్లను కొట్టివేస్తున్నట్టు ప్రకటించింది. ఐఏఎస్ అధికారులను ప్రస్తుతం వారున్న స్థానంలోనే కొనసాగించాలని కోరుతూ రెండు రాష్ట్రాలు కేంద్రానికి లేఖలు రాశాయని, 15 రోజుల పాటు కేంద్రం ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వాలని పిటిషనర్లు కోరారు. వచ్చే నెల 4వ తేదీన క్యాట్‌లో ఈ కేసు విచారణ ఉందని, కేంద్ర ఉత్తర్వులపై స్టే ఇవ్వని నిపక్షంలో క్యాట్‌లో కేసు తేలే వరకు మధ్యంతర స్టే అయినా ఇవ్వాలని, ఇదీ కుదరనిపక్షంలో కనీసం వచ్చే నెల 4వ తేదీ వరకు అయినా స్టే ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఎంతకాలం స్టే ఉత్తర్వులతో కొనసాగుతారని, స్టే ఆదేశాలు జారీ చేసుకుంటూ పోతే ఎప్పటికీ ఈ వ్యవహారం కొలిక్కిరాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రెండు రాష్ట్రాల్లో పాలన ఈ అధికారులపైనే నడుస్తున్నదా? వారు లేకపోతే పాలన సాగదా? అని ప్రశ్నించింది.

అధికారులను రిలీవ్ చేసిన ప్రభుత్వాలు

తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ క్యాడర్‌కు చెందిన ఐదుగురు ఐఏఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం రిలీవ్ చేసింది. సొంత క్యాడర్‌కు వెళ్లాలన్న హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. ఐఏఎస్‌లు వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి కాట, వాణీ ప్రసాద్, ప్రశాంతిని రిలీవ్ చేసింది. అంతకు ముందు ఐఏఎస్‌లు సీఎస్ శాంతికుమారితో సచివాలయంలో వారు భేటీ అయ్యారు. ఇప్పటివరకు జరిగిన పరిణామాలపై చర్చించినట్టు తెలిసింది. అనంతరం వారు ఏపీకి వెళ్లి రిపోర్ట్ చేశారు. మరోవైపు ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ క్యాడర్ ఐఏఎస్‌లు శ్రీజన, శివశంకర్ హైదరాబాద్‌కు వచ్చి రిపోర్ట్ చేశారు. దీంతో కొన్నాళ్లుగా జరుగుతున్న నాటకీయ పరిణామాలకు తెరపడినట్టయ్యింది. అయితే తెలంగాణలో పనిచేస్తున్న ఐపీఎస్‌లు అంజనీకుమార్, అభిలాష బిష్త్‌కు సంబంధించి ఇంకా సస్పెన్స్ కొనసాగుతున్నది. వారిని ప్రభుత్వం బుధవారం రాత్రి వరకు రిలీవ్ చేయలేదు. వారికి సంబంధించిన డీవోపీటీ ఆదేశాలు ఇంకా అందలేదని, అందుకే రిలీవ్ చేయలేదని సచివాలయ వర్గాలు తెలిపాయి.

ఆరుగురికి పూర్తి అదనపు బాధ్యతలు ..

రిలీవ్ అయిన ఐదుగురు ఐఏఎస్‌ల స్థానంలో వారి బాధ్యతలను మరో ఐదుగురు ఐఏఎస్‌లకు కేటాయిస్తూ సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. యువజన సర్వీసు లశాఖ ముఖ్యకార్యదర్శిగా ఎన్ శ్రీధర్‌కు, ఇంధనశాఖ కార్యదర్శిగా సందీప్‌కుమార్ సుల్తానియాకు, ఆయుష్ డైరెక్టర్‌గా క్రిస్టినా జడ్ చొంగ్తుకు, మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యదర్శిగా టీకే శ్రీదేవికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఐఏఎస్ రొనాల్డ్ రోస్ సతీమణి విశాలాచ్చి కొన్నాళ్లుగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోగా బాధ్యతలు నిర్వరిస్తున్నారు. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో.. ఆమె స్థానంలో ఆర్వీ కర్ణన్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఈసారి మరింత చలి

- అక్టోబర్-నవంబర్ మధ్యలో 'లానినా'
- శీతాకాలంలో కనిష్ఠస్థాయికి ఉష్ణోగ్రతలు
- హైదరాబాద్‌లో చలితీవ్రత పెరిగే అవకాశం: ఐఎండీ

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): అక్టోబరు –నవంబర్ మధ్య కాలంలో ఏర్పడే 'లానినా' పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో శీతాకాల ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతాయని ఇండియన్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ తెలిపింది. ఓవైపు వర్షాకాలం ముగిసినా, వాయుగుండం ఎఫెక్ట్‌తో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో వారంలో ఈ వానలు తగ్గుతాయి. కాగా, ఈ ఏడాది శీతాకాలంలో హైదరాబాద్‌లో అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఐఎం డీ హెచ్చరించింది. 2024 జనవరిలోనే హైదరాబాద్ సిటీలో 8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సారి 5,6 డిగ్రీలు నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు ఐఎండీ హెచ్చరించింది. ఈ ఏడాది శీతాకాలం సవాల్‌తో కూడుకున్నదని అంచనా వేసిన వాతావరణ శాఖ, తక్కువ ఉష్ణోగ్రతల కారణంగా ఉదయాన్నే పొగమంచు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది.

రాష్ట్రంలో నేడు వర్షాలు

ఏడు ఉమ్మడి జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండం గా బలపడింది. దీని ప్రభావంతో బుధవారం తెలంగాణలోని పలుచోట్ల వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి హైదరాబాద్‌లో చిరుజల్లులు కురుస్తున్నాయి. గురువారం రాష్ట్రంలో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ, వరంగల్, రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్‌తో పాటు నిర్మల్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని కేంద్రం తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. వాయుగుండం ప్రభావంతో ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమలో కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షా లు కురిసే అవకాశం ఉన్నది. నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేశారు.

'ఓటుకు నోటు' విచారణకు సీఎం రేవంత్ గైర్హాజరు

- నిరసన వ్యక్తం చేసిన మత్తయ్య
- వచ్చే నెల 14కు విచారణ వాయిదా

సీఎం రేవంత్‌రెడ్డి

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 16 (నమస్తే తెలంగాణ): ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డితోపాటు మూడో నిందితుడు రుద్ర శివకుమార్ ఉదయ్‌సింహ బుధవారం ఈడీ కోర్టు విచారణకు హాజరుకాలేదు. ఈ కేసులో ఇతర నిందితులుగా ఉన్న బిషప్ హర్సీ సెబాస్టియన్ (ఏ2), జెరూసలెం మత్తయ్య (ఏ4), సండ్ర వెంకటవీరయ్య (ఏ5) మాత్రమే కోర్టుకు హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి గైర్హాజరులపై మత్తయ్య నిరసన వ్యక్తం చేస్తూ కోర్టు ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించారు. 2021 నుంచి ఈ కేసు పురోగతి సాధించకపోవడం, విచారణకు సీఎం రేవంత్ సహకరించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు దృష్టిలో అందరూ సమానమేనని పేర్కొంటూ.. రేవంత్‌ను విచారణకు రప్పించేందు